# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక



**లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,


## ఇండస్ట్రియల్ పార్క్ రైతులకు అండగా ఉంటాం..

హుస్నాబాద్ : హుస్నాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ లో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ సమీకృత కార్యాలయ సముదాయం లోని మీటింగ్ హాల్ లో టిజీఐఐసి ఇండస్ట్రియల్ పార్క్ లో వలన భూమి కోల్పోతున్న అక్కన్న పేట మండలం చౌటపల్లి , జనగామ, తోటపల్లి గ్రామాల రైతులతో భూ సేకరణ ప్రక్రియ గూర్చి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్కన్న పేట మండలంలో చౌటపల్లి , జనగాం, తోటపల్లి గ్రామాల్లో దాదాపు 124 ఎకరాలు భూమి టిజీఐఐసి కి అందించి ఇండస్ట్రియల్ పార్క్ గా అభివృద్ధి చేసి ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపనతో ప్రాంత యువతకు ఉద్యోగ ఉపాధి లభిస్తుందని ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి అందరూ సహకారం అవసరం అని తెలిపారు. మీప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్లు తదితరులు ఉన్నారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:85 ఎడిటర్: సయ్యద్ పాష 11-04-2026 శనివారము పేజీలు :8 వెల:1/-


# కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ..





సిద్దిపేట : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ‘ అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని’ అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.‘ తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది’ అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు.

# వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ




ఖమ్మం, రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని చేగొమ్మలో గోదాం ప్రారంభోతవంలో పాల్గొన్న మంత్రి.. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12 వేలు ఇస్తున్నామని వెల్లడించారు. ధరణితో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి తమ ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.80 లక్షల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చామని వెల్లడించారుకొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకి, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావును ఉద్దేశించి విమర్శించారు. ఎవరు ఎన్ని కారుకూతలు కూసిన భవిష్యత్తులో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేద వారికి అండగా ఉంటుందని అన్నారు. ఎవరి తాటాకు చప్పుళ్లకు బెదరిదే లేదని హెచ్చరించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు ఐదు వందల బోనస్ ఇస్తున్నామని తెలిపారు. సన్న వడ్లను ఇతర ప్రాంతాలకు పంపించకుండా రాష్ట్రంలోని పేదలకు రేషన్ ద్వారా ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.కాగా, నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో మాజీ మంత్రి హరీష్ రావు, పొంగులేటి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తన కుమారుడిని కాపాడుకునేందుకు పొంగులేటి అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఆయన పొంగులేటి కాదని.. పొంగులాటీ అని ఆరోపించారు. నాదర్‌గుల్ భూముల కుంభకోణం బయటపడుతోందని పొంగులేటిలో ఫ్రస్ట్రేషన్ కనిపిస్తోందని.. సమాధానం లేనప్పుడు బూతులను వెతుక్కుంటారన్నారని ఫైరయ్యారు. ఆయన ఆత్మరక్షణలో పడినట్లు అర్థమవుతోందని... మంత్రిగా కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అధినేతగా పొంగులేటి మాట్లాడారని విమర్శించారు.మైనింగ్ అవినీతిని అధికారులే గుర్తించారని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది తప్పా.. పొంగులేటి చెబుతున్నది తప్పా ఏదో ఒకటి తేలాలన్నారు. కంటైనర్‌పై రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పేరు.. కాంగ్రెస్ జెండా ఎందుకు ఉన్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. అధికారుల నోటీసు కాపీని అందుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ ఉద్యోగి ఇచ్చిన కాపీనే తాను అసెంబ్లీలో చూపించానని వెల్లడించారు. నాదర్‌గుల్‌లో భూములు కాపాడింది బీఆర్ఎస్ అని.. 2016లో ఆ భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చామని తెలిపారు. కంపెనీలు కేసు వేస్తే సింగిల్, డివిజన్ బెంచ్‌లలో ప్రభుత్వ లాయర్లతో వాదించి గెలిచినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు పొంగులేటి చెబుతున్నట్లు అవి ప్రభుత్వ భూములైతే ఎందుకు కంపెనీల బోర్డులు మారుతున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు.

# రాజ్యసభ సభ్యుడిగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రమాణం



న్యూఢిల్లీ: బీహార్ సీఎం నితీశ్ కుమార్. ఇవాళ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమక్షంలో హిందీ భాషలో నితీశ్ కుమార్ ప్రమాణం చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘావల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జేడీయూ నేత, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జయరాం రమేశ్, బీజేపీ ఎంపీలు రాజీవ్ ప్రతాప్ రూఢీ కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ కుమార్ ప్రమాణం చేసిన నేపథ్యంలో.. ఇక బీహార్‌లో ఆయన ప్రస్థానం ముగిసినట్లు చెబుతున్నారు.ఏప్రిల్ 14వ తేదీన ఎన్డీఏ కూటమి .. బీహార్ కొత్త సీఎంను ఎన్నుకోనున్నది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరికి సీఎం పదవి వరించే అవకాశం ఉన్నదని జోరుగా ప్రచారం జరుగుతున్నది.

# బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టులన్నీ కాసుల కోసమేనా



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీపై మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శలు చేశారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని తెలిసినా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీ యూపీఏ అన్నారు. గొల్లపల్లి ప్రాజెక్టును కాసుల కోసమే కడుతున్నారని తమనే విమర్శిస్తున్నారని మంత్రి జూపల్లి ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులన్నీ కాసుల కోసమేనా? అని ప్రశ్నించారు. గొల్లపల్లి ప్రాజెక్టును కట్టాలని సమైక్య రాష్ట్రంలో అనేకసార్లు అడిగామని గుర్తుచేశారు. 25 టీఎంసీలతో గొల్లపల్లిని నిర్మిస్తామని 2016లో జీవో ఇచ్చారు. 20 రిజర్వాయర్లు నిర్మించాలని 2019 మార్చిలో వాళ్లే ప్రతిపాదించారని పేర్కొన్నారు. రోజుకు సుమారు 10 టీఎంసీలు లిఫ్ట్ చేస్తే శ్రీశైలంలో నీళ్లు ఉంటాయా? రాయలసీమ, ముచ్చుమర్రి, గాలేరు- నగరి పేరుతో లిఫ్ట్ చేస్తే పరిస్థితి ఏమిటి? అని మంత్రి ప్రశ్నించారు. పాలమూరు లిఫ్ట్ ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరు ఇస్తామని మీరే చెప్పారని పేర్కొన్నారు.విద్యుదుత్పత్తి పేరుతో ఏపీ పంపులు ఆన్ చేసి నీరు కిందకు వదిలిందని చెప్పారు. ధర్నా చేస్తామని హెచ్చరిస్తే అప్పుడు వెనక్కి తగ్గారని సూచించారు. ‘అన్నీ మామ, అల్లుడికే తెలుసని అనుకుంటే ఎలా .. తెలివి మీ ఒక్కరి సొత్తే కాదు.. అవతలి వారికీ ఉంటుంది’ అన్నారు. ఏపీతో నీటి విభజన ఒప్పందంపై మామా, అల్లుడు సంతకాలు చేశారని జూపల్లి ఆరోపించారు. మీకు ధనిక రాష్ట్రం అప్పగిస్తే.. రూ. 8లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని ధ్వజమెత్తారు. అనేక ప్రాజెక్టుల్లో భూసేకరణ పరిహారం కూడా మీరు ఇవ్వలేదన్నారు. నీళ్లు ఉన్న చోట లిఫ్ట్ ద్వారా నీళ్లు పట్టుకుపోతున్నారని చెప్పారు. పదేళ్లలో నీళ్లు లేనిచోట మాత్రం అనేక ప్రాజెక్టులు కట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఆలోచన, అవగాహన లేక తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని ఆరోపించారు.

# రాజ్యసభకు హరివంశ్ నారాయణ్ సింగ్

న్యూఢిల్లీ: రాజ్యసభ పదవీకాలం ముగియనున్న ఉపసభాపతి హరివంశ్ నారాయణ్ సింగ్‌ను రాష్ట్రాల మండలి సభ్యుడిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. హరివంశ్ ఎగువ సభ సభ్యుడిగా పదవీకాలం ఏప్రిల్ 9న ముగిసింది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణ అనంతరం ఏర్పడిన ఖాళీలో ఆయన రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. “భారత రాజ్యాంగంలోని 80వ అధికరణం, (1)వ ఖండం ఉప-ఖండం ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఆ అధికరణంలోని (3)వ ఖండంతో కలిపి చదువగా నామినేటెడ్ సభ్యులలో ఒకరి పదవీ విరమణ కారణంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికి, హరివంష్‌ను రాష్ట్రాల మండలి కి నామినేట్ చేయడానికి రాష్ట్రపతి సంతోషించారు.” అని ప్రభుత్వం జారీ చేసిన ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. 69 ఏళ్ల హరివంశ్, బిహార్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ రాజ్యసభ సభ్యుడిగా తన రెండు పర్యాయాలను పూర్తి చేసుకున్నారు. ఆయన రాజ్యసభ ఉపసభాపతిగా కూడా సేవలందించారు.

# షెడ్యూల్ ప్రకారమే ఇంటర్ ఫలితాల విడుదల



హైద్రాబాద్: గత పదేళ్లుగా ఇంటర్ ఫలితాలు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో విడుదల కాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ, సాంకేతిక అంశాల పరిశీలన వంటి వివిధ కారణాల వల్ల ప్రతి ఏటా ఫలితాల తేదీలు మారుతూ వస్తున్నాయని చెప్పారు. 2014 నుంచి 2025 వరకు విడుదలైన తేదీలను గమనిస్తే.. ఫలితాలు ఏప్రిల్ మూడో వారం లేదా మే నెలలో వచ్చినట్లు స్పష్టమవుతోందని చెప్పారు. ఈమేరకు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను ఫ్యాక్ట్ చెక్ చేస్తూ.. గతంలో రిజల్ట్స్ విడుదల చేసిన తేదీలను వెల్లడించారు. 2014 ఏడాదిలో మే 3, 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017లో ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2020లో జూన్ 18న, 2021లో జూన్ 28న, 2022లో జూన్ 28న, 2023లో మే 9న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న ప్రకటించినట్లు చెప్పారు. కొవిడ్ సమయంలో అంటే 2020, 2021 పరిస్థితులు భిన్నంగా ఉండటంతో జూన్ నెలలో అందర్ని పాస్ చేస్తూ ఫలితాలు విడుదలయ్యాయని తెలిపారు. గతేడాది ఏప్రిల్ 22న ఫలితాలు ప్రకటించినట్లు స్పష్టం చేశారు. ఈ క్రమాన్ని బట్టి చూస్తే.. ఈ ఏడాది కూడా మూల్యాంకన ప్రక్రియ ముగిసిన వెంటనే షెడ్యూల్ ప్రకారం అధికారికంగా ఫలితాలను ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అసత్య వార్తలను నమ్మి విద్యార్థులు మానసిక ఒత్తిడికిలోను కావొద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫలితాల తేదీ ఖరారు కాగానే విద్యాశాఖ స్వయంగా మీడియా ద్వారా, అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ఫలితాలు వెల్లడిస్తుందని పేర్కొంది. కేవలం అధికారిక పోర్టల్స్‌లో వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరింది. తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కూడా నిఘా ఉంచామని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని విద్యాశాఖ స్పష్టం చేసింది.కాగా, తెలంగాణ వ్యాప్తంగా ఫిబ్రవరి 25న ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. మార్చి 18తో పరీక్షలు ముగిశాయి. మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9,97,075 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. గతంతో పోలిస్తే ఈసారి పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. ప్రస్తుతం జవాబు పత్రాల స్కానింగ్, కోడింగ్, డీ-కోడింగ్ ప్రక్రియలు సాగుతున్నట్లు తెలిసింది. ఫలితాల వెల్లడికి సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు కొద్ది రోజుల్లోనే అధికారిక ప్రకటన విడుదల చేయనుంది.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త



హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు క్యాలెండర్ సంవత్సరం 2026 నుండి వర్తించేలా డీఏను 2.1 శాతం పెంపును రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రకటించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ఉన్న ఏకైక పెండింగ్ డీఏ ను ప్రభుత్వం విడుదల చేసింది. డీఏ 50.7 శాతం నుండి 52.8 శాతానికి పెంచబడింది. సవరించిన ఈ డీఏ జనవరి 1, 2026 నుండి అమలులోకి వస్తుంది. గత మూడు నెలల బకాయిలను, రాబోయే మూడు నెలల పాటు అనుబంధ బిల్లుల ద్వారా చెల్లిస్తారని మంత్రి వెల్లడించారు. ఈ పెంపుదల కారణంగా ఆర్టీసీపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అంతకుముందు, జూలై 2025లో, రాష్ట్ర ప్రభుత్వం డీఏను 2.1 శాతం మేర పెంచి, దానిని 48.6 శాతం నుండి 50.7 శాతానికి చేర్చింది. ప్రస్తుత సవరణతో డీఏ ఇప్పుడు 52.8 శాతానికి చేరుకుంది. మే 2024లో =ూా--2017 అమలుతో, ఉద్యోగులకు సంబంధించిన ఎటువంటి డీఏ బకాయిలు పెండింగ్‌లో లేవు. డీఏ పెంపు సందర్భంగా మంత్రి ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీ. నాగి రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. డీఏ ప్రకటించినందుకు సీనియర్ అధికారులు కూడా మంత్రిని అభినందించారు. ఆర్టీసీ పెండింగ్ పనులు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఏకైక కరువు భత్యం ఇప్పుడు మంజూరు చేయబడిందని మంత్రి తెలిపారు. సవరించిన 52.8 శాతం కరువు భత్యం జనవరి 2026 నుండి అమల్లోకి వస్తుంది. జనవరి నుంచి బకాయిపడిన మొత్తాలను రాబోయే మూడు నెలల్లో వాయిదాలలో విడుదల చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాన్ని నిర్ధారించడం, ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఆర్టీసీ సంస్థను పరిరక్షించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. ప్రధానంగా కార్మికుల సంక్షేమంపై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రి అప్గ్రేడేషన్ ,కారుణ్య నియామకాలు,దీర్ఘ కాలంగా రిమూవ్ అయిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడం, కొత్త నియామకాలు చేపట్టి పని భారం తగ్గించడం ,కొత్త బస్సులు కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు చేస్తుందని పేర్కొన్నారు.

# కేఎంసీలో ర్యాగింగ్ కలకలం!

హైదరాబాద్: జూనియర్లను ర్యాగింగ్ చేశారనే ఆరోపణలపై వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల అధికారులు ఏడుగురు ఎంబీబీఎస్‌మూడవ సంవత్సరం విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కాకతీయ వైద్యకళాశాలలో ర్యాగింగ్ ఘటనపై ప్రిన్సిపల్ సంధ్య స్పందించారు. విచారణ చేసిన బాధ్యులపై చర్యలు తీసుకున్నామని కేఎంసీ ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కేఎంసీలో ర్యాగింగ్ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. జూనియర్లను మోకాళ్లపై నిలబెట్టారు.. గోడకుర్చీలు వేయించారని చెప్పారు. ఏడుగురు విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు కేఎంసీ ప్రిన్సిపల్ సంధ్య ప్రకటించారు. అలాగే కోర్సు కాలమంతటికీ హాస్టల్ నుండి బహిష్కరించినట్లు తెలిపారు. ఇలాంటివి మరోసారి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.కొంతమంది ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు తమ వాట్సాప్ గ్రూపులో తృతీయ సంవత్సరం విద్యార్థులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఇటీవల రెండవ సంవత్సరం విద్యార్థుల వ్యాఖ్యల గురించి తెలుసుకున్న మూడవ సంవత్సరం విద్యార్థులు వారిని శిక్షించాలని అనుకున్నారు. వారు 20 మంది రెండవ సంవత్సరం విద్యార్థులను హాస్టల్ టెర్రస్‌పైకి పిలిపించి, మోకాళ్లపై కూర్చోబెట్టి, క్షమాపణ చెప్పించి, మళ్లీ అలాంటి ప్రవర్తనను పునరావృతం చేయబోమని ప్రమాణం చేయించారు. విద్యార్థులలో ఒకరు ఈ సంఘటనను తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి, వరంగల్ కమిషనరేట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, నేషనల్ మెడికల్ కౌన్సిల్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో, కళాశాల అధికారులు తప్పు చేసిన మూడవ సంవత్సరం విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు.

# 42 మంది మావోయిస్టులు లొంగుబాటు

హైదరాబాద్ : తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టులకు చెందిన కీలక నాయకులతో సహ మొత్తం 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో 36 ఆయుధాలు, 800 గ్రాముల బంగారంతో లొంగిపోయారని పోలీసులు ప్రకటించారు. వీరంతా చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వారని వెల్లడించారు.పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్, డీకేఎస్‌జెడ్‌సీ సభ్యుడు సోడి మల్ల ఎలియాస్ కేషాల్, జేఎంఎండబ్ల్యూసీ డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ అలియాస్ గజేందర్, బీకే ఎఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కడ్తి సన్నుతో లొంగిపోయారు. ఐదు ఏకే-47 రైఫిళ్లు, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, మూడు ఇన్‌సాస్ రైఫిళ్లు, ఆరు 303 రైఫిళ్లు, ఒక 9ఎంఎం స్టెన్ గన్, రెండు 8 ఎంఎం రైఫిళ్లు, పది సింగిల్ షాట్ గన్స్, ఒక 9 ఎంఎం పిస్టల్, రెండు రివాల్వర్లు, 1007 తూటాలు, 800 గ్రాముల బంగారాన్ని పోలీసులకు అప్పగించారు. 42 మంది జనజీవన స్రవంతిలో కలవడం ద్వారా సీపీఐ మావోయిస్టు లోని మూడు మ్యాజిక్ వెపన్స్‌లో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగు అయిందని తెలిపారు.లొంగిన మావోయిస్టులకు కోటీ 93 లక్షల రివార్డును త్వరలో అందజేస్తామని వివరించారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### వల్ల వృత్తికి అంకితమై, చట్టానికి బద్ధులై పనిచేసే పోలీసులు తలదించుకోవలసి వస్తోంది...

లాకప్ గదుల గోడలకే గనుక కళ్లుండి ఉంటే, నిందితులపట్ల కొందరు పోలీసులు ఎంతటి అమానుషంగా ప్రవర్తిస్తారో చూసి కంటనీరు పెట్టేవి. వాటికే గనుక శ్రవణశక్తి ఉంటే పోలీసుల చిత్రహింసలకు నిందితులు చేసే ఆర్తనాదాలు వినలేక చెవులు మూసుకుని ఉండేవి. నేరాభియోగంపై, కొండకచొ నిరపరాధులను సైతం నిర్బంధించి, విచారణ పేరిట హింసించి, పైశాచిక ఆనందం పొందే పోలీసుల సంఖ్య మన సమాజంలో తక్కువేమీ కాదు. ఇలాంటివారి వల్ల వృత్తికి అంకితమై, చట్టానికి బద్ధులై పనిచేసే పోలీసులు తలదించుకోవలసి వస్తోంది. ఓ లాకప్ డెత్ కేసుకు సంబంధించి మదురై అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తాజాగా వెలువరించిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.కోవిడ్ సమయంలో నిబంధనలను ఉల్లంఘించి దుకాణం తెరిచారన్న అభియోగంపై తండ్రీకొడుకులను అరెస్ట్ చేసిన సాత్తాంకుళం పోలీసులు వారిద్దరినీ వేధించి, వారి చావుకు కారణమైన వైనం ఎంతటి పాషాణ హృదయులనైనా కరిగించకమానదు. ఈ ఘటనకు కారణమైన తొమ్మిదిమంది పోలీసులకు ఉరిశిక్ష విధించడం ద్వారా మదురై కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. హింసించి చంపడమే కాదు, తమ అమానుష కాండను మసిపూసి మారేడుకాయ చేసి, సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు ప్రయత్నించిన తీరును గమనించి న్యాయమూర్తే ఆశ్చర్యపోయారంటే సదరు పోలీసులు ఎంతటి ఆరితేరిన బంట్లో అర్థం చేసుకోవచ్చు. రాత్రంతా స్టేషన్‌లో నిర్బంధించి, బట్టలూడదీసి, పైశాచికంగా దాడి చేశారనీ, లాకప్ గోడలకు అంటిన రక్తపు మరకలను నెత్తురోడుతున్న బాధితులతోనే కడిగించారని సదరు పోలీసుల అకృత్యాలను సిబిఐ తన 1500 పేజీల చార్జిషీట్ లో సవివరంగా కళ్లకు కట్టింది. దీనిని అరుదైన కేసులలో అత్యంత అరుదైనదిగా పేర్కొన్న న్యాయమూర్తి, యావజ్జీవ కారాగార శిక్షతో సరిపెడితే ఇలాంటి నేరగాళ్లకు భయం లేకుండా పోతుందని పేర్కొనడం ముమ్మాటికీ సత్యం. లాకప్ డెత్ అనే మాట నేటి సమాజంలో సర్వసాధారణమైపోయింది. దేశంలో ఎక్కడో ఒక చోట తరచూ లాకప్ మరణాలు సంభవిస్తూనే ఉన్నా, శిక్ష పడుతున్న దృష్టాంతాలు చాలా తక్కువ. శాంతిభద్రతల పరిరక్షణకు చట్టాలను ఎంత పటుతరంగా రూపొందించినా, వాటిని అమలు చేసే పోలీసు వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాజకీయ నేతల జోక్యం వంటి పలు కారణాల పుణ్యమాని, ఇప్పటికీ సామాన్యుడు పోలీసు స్టేషన్ గడప తొక్కేందుకు భయపడుతూనే ఉన్నాడు.సాత్తాంకుళం కేసును సిబిఐకి అప్పగించడం, స్టేషన్‌లో జరిగిన అరాచకపర్వంపై ఓ మహిళా కానిస్టేబుల్ కోర్టులో కళ్లకు కట్టినట్లుగా సాక్ష్యం చెప్పడం వంటివాటి కారణంగా ఈ కేసు నిలబడగలిగింది. సాధారణంగా ఇలాంటి కేసులలో పోలీసులు 'ముందుజాగ్రత్తలు' తీసుకుంటారు. సాత్తాంకుళం కేసులోనూ సిసి కెమెరాల ఫుటేజీని మాయం చేశారు. దీనిపై మద్రాస్ హైకోర్టు మండిపడుతూ, సిసి కెమెరాల ఫుటేజీని భద్రపరచవలసిందిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తీర్పు వెలువడిన రోజే సర్వోన్నత న్యాయస్థానం పోలీస్ స్టేషన్లలో సిసి కెమెరాల ఏర్పాటు విషయమై కేంద్ర హోంశాఖ కార్యదర్శిని తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించడం యాదృచ్ఛికం కావచ్చు. కానీ, ఠాణాలలో జరిగే అరాచకాలను కళ్లకు కట్టేవి సిసి కెమెరాలే అనడంలో సందేహం లేదు. పోలీస్ కస్టడీలో హింసను అరికట్టేందుకు సుప్రీంకోర్టు 30 ఏళ్ల క్రితమే పోలీసులకు 11 మార్గదర్శకాలను జారీ చేసింది. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తికి కూడా ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కులు ఉంటాయని గుర్తు చేసింది. కానీ, అనేక సందర్భాలలో నిందితుడిని అదుపులోకి తీసుకునే పోలీసులు, అతని అరెస్టును చూపించరనేది జగమెరిగిన సత్యం.సాత్తాంకుళం కేసు తీర్పుతో అయినా ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు పాలకులు నడుం బిగించాలి. పోలీసులు మార్చలేని, సాక్ష్యాలను ఏమార్చలేని విధంగా ఠాణాల్లో సిసి కెమెరాల నిఘా పెట్టాలి. దీనిని అతిక్రమించే అధికారులకు భారీ జరిమానాలు విధించాలి. పోలీస్ స్టేషన్లలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు పౌర సమాజంలోని ప్రతినిధులకు అవకాశం కల్పించాలి. అన్నింటికీ మించి, పోలీసుల మానసిక ప్రవర్తనలో మార్పు తెచ్చేలా, వారిలో మానవతావాద విలువలను ప్రోది చేస్తూ, బాధ్యతాయుతంగా మసలుకునేలా శిక్షణ గరపాలి. పోలీస్ కస్టడీలో హింస కొనసాగుతోందంటే కారణం చట్టాలు లేకపోవడం కాదు. వాటిని అమలు చేసే అధికారులలో చిత్తశుద్ధి లోపించడమే. సాత్తాంకుళం కేసులో నిందితులకు ఉరిశిక్ష పడిఉండవచ్చు గాక, కానీ, సామాన్య పౌరుడు నిర్భయంగా, నిస్సంకోచంగా పోలీస్ స్టేషన్ గడప తొక్కే రోజు వచ్చినప్పుడే ఈ కేసులో మృతులైన జయరాజ్, బెన్నిక్స్‌ల ఆత్మకు శాంతి కలుగుతుంది.

### తక్కువ ధరకే కాలింగ్, ఎస్ఎంఎస్

న్యూఢిల్లీ:టెలికాం సంస్థల రీఛార్జ్ ధరల పెంపుతో సతమతమవుతున్న సామాన్య వినియోగదారులకు ట్రాయ్ శుభవార్త చెప్పింది. డేటా అవసరం లేకుండా కేవలం కాల్స్, ఎస్ఎంఎస్ సౌకర్యాలు మాత్రమే కోరుకునే వారి కోసం తక్కువ ధరకే ప్రత్యేక ప్లాన్‌లను తీసుకురావాలని ఆదేశించింది.ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు అందిస్తున్న దాదాపు అన్ని ప్లాన్‌లు డేటాతో కూడి ఉంటున్నాయి. దీనివల్ల ఇంటర్నెట్ వాడని సాధారణ మొబైల్ వినియోగదారులు కూడా అనవసరంగా ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. దీన్ని అరికట్టేందుకు ట్రాయ్ 'టెలికాం వినియోగదారుల రక్షణ 13వ సవరణ నిబంధనలు, 2026' పేరుతో కొత్త ముసాయిదాను సిద్ధం చేసింది.ప్రతి టెలికాం సంస్థ కనీసం ఒక వాయిస్ కాల్, ఎస్ఎంఎస్ ప్లాన్‌ను విధిగా అందించాలి.డేటా లేని కారణంగా ఈ ప్లాన్‌ల ధరలు సాధారణ ప్లాన్‌ల కంటే చాలా తక్కువగా ఉండాలని ట్రాయ్ స్పష్టం చేసింది.ఈ ప్లాన్‌లు కేవలం లాంగ్ వాలిడిటీతోనే కాకుండా, తక్కువ రోజుల వాలిడిటీతో కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించింది.అయితే గతంలో ఇచ్చిన ఆదేశాలతో కొన్ని కంపెనీలు ఇలాంటి రీఛార్జ్ ప్లాన్‌లు తెచ్చినప్పటికీ వాటి ధరల్లో పెద్దగా మార్పులు ఏమి చేయలేదు. అంటే డేటా సౌకర్యాన్ని తొలగించినప్పటికీ కూడా సామాన్యులకు పెద్దగా లాభం చేకూరలేదు. దీని వల్ల కేవలం కంపెనీలు మాత్రమే లాభపడ్డాయి.ట్రాయ్ తెచ్చిన ఈ కొత్త నిబంధనలతో సామాన్యులకు బిగ్ రిలీఫ్ దొరకనుంది. ఇది ఇంటర్నెట్ అవసరం లేని వృద్ధులకు, గ్రామీణ ప్రాంత వినియోగదారులకు ఇది ఎంతో మేలు చేస్తుంది. అంతేకాదు వినియోగదారులు తమకు నచ్చిన సేవలను మాత్రమే ఎంచుకునే అవకాశం లభిస్తుంది. అలాగే ఈ సవరణ టెలికాం మార్కెట్‌లో పారదర్శకతను పెంచి, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తుంది. ఇది వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కంపెనీలు కొత్త రకాల ప్లాన్‌లతో ముందుకు రావాల్సిన పరిస్థితిని తీసుకొస్తుంది.

### అట్టహాసంగా సామాజిక సాధికారత వారోత్సవాలు..

హైదరాబాద్, : డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న "సామాజిక సాధికారత వారోత్సవాలు'' ఘనంగా ప్రారంభమయ్యాయి. డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో భాగంగా "సాంస్కృతిక, క్రీడా సమ్మేళనాన్ని" విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. జి. పుష్ప చక్రపాణి ప్రారంభించారు.?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో నిత్యం పని ఒత్తిడితో బిజీగా ఉండే సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మానసిక మరియు శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె సూచించారు. వారం రోజుల పాటు బోధన మరియు బోధనేతర సిబ్బందికి వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు బోధనేతర ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కాంతం ప్రేమ్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ప్రొ. ఐ. ఆనంద్ పవార్, ప్రొ. వెంకట రమణ, డా. బానోత్ ధర్మ, ప్రొ. కె. కృష్ణా రెడ్డి, డా. వై. వెంకటేశ్వర్లు, ప్రొ. బి. శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ సంఘ సభ్యులు మియా జనీ, పి. విశ్వనాథ్, వై. అశోక్, కె. పాండు, భరత్ రెడ్డి, డాక్టర్ యాకేశ్ దైదా తో పాటు వివిధ విభాగాల డైరెక్టర్లు, డీన్లు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కొత్త కార్పొరేషన్లలో 17 శాతం

హైదరాబాద్:కొత్త కార్పొరేషన్లలో 17శాతం, మున్సిపాల్టీల్లో 13శాతం ఇంటి అద్దె భత్యం మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి కోరారు. ఈమేరకు రెండవ వేతన సవరణ సంఘం చైర్మెన్ శివశంకర్, సభ్యులు ఏ.రామయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ కార్పొరేషన్లకు, వాటి శివారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 17శాతం, నూతన మున్సిపాల్టీలకు, వాటి శివారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 13 శాతం ఇంటి అద్దె భత్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ 1.07.2023 నాటి ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి తమ సిఫారసులుంటాయని పేర్కొన్నారు. నగరాలు, పట్టణాలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వమే ఇంటి అద్దె భత్యం మంజూరు చేయాలని తమ సిఫారసుల్లో ఉంటుందని తెలిపారు. గత పీఆర్సీ జీవో 53 ప్రకారం అర్హత గల నగరాలు, పట్టణాలకు పెంచిన హెచ్ఆర్ఏ వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి సచివాలయంలో వారు వినతిపత్రం అందజేశారు.

## నగరంలో పెరుగుతున్న ఉబకాయులు



ప్రస్తుతం మధుమేహం (డయాబెటిస్), ఊబకాయం (ఒబేసిటీ).. తీవ్రమైన సమస్యలుగా మారుతున్నాయి. 30 ఏళ్లకే చాలా మంది యువకులు ఈ డయాబెటిస్, ఒబేసిటీలతో బాధపడుతున్నారు. ఇక ఇప్పటికే దేశంలోనే మధుమేహ రాజధానిగా హైదరాబాద్‌ను పిలుస్తుండగా.. తాజాగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలో ఊబకాయ బాధితుల సంఖ్య అమాంతం పెరిగినట్లు వెల్లడైంది. అపోలో హాస్పిటల్స్ తయారు చేసిన హెల్త్ ఆఫ్ ది నేషన్ రిపోర్ట్ 2026 ప్రకారం.. హైదరాబాద్‌లో ఊబకాయం సమస్య శరవేగంగా పెరుగుతున్నట్లు తేలింది. 37.5 లక్షల మంది ఈ ఒబేసిటీ పరీక్షలు చేసుకోగా.. అందులో 81.3 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లు తేలడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.2025లో హైదరాబాద్ నగరంలో ఒబేసిటీ బాధితుల సంఖ్య 63 శాతంగా ఉండగా.. కేవలం ఒక్క ఏడాదిలోనే అందులో 18 శాతం పెరుగుదల నమోదు కావడం సంచలనం రేపుతోంది. ఇక హైదరాబాద్ కంటే ముందు ముంబై నగరం.. దేశంలోనే అత్యధికంగా ఊబకాయులు పెరుగుతున్న నగరంగా నిలిచింది. నగరాల వారీగా ఊబకాయం గణాంకాలను పరిశీలిస్తే.. 81.6 శాతంతో ముంబై తొలి స్థానంలో ఉండగా.. 81.3 శాతంతో హైదరాబాద్, ఢిల్లీ ఆ తర్వాత స్థానంలో ఉన్నాయి. కోల్‌కతా 78.4 శాతం.. బెంగళూరు 77.8 శాతం.. చెన్నై 77.3 శాతాలతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి.వైద్య నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, అధికంగా స్మార్ట్ ఫోన్ వాడటం, స్టెరాయిడ్లను ఇష్టం వచ్చినట్లు వాడటం వంటివి ఊబకాయం పెరగడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. శారీరక శ్రమ లేకుండా గంటల తరబడి కూర్చుని ఉండటంతోపాటు అధికంగా జంక్ ఫుడ్ తీసుకోవడం, ఒత్తిడి వల్ల ఎక్కువగా తినడం కూడా ఒబేసిటీకి దారితీస్తాయని చెబుతున్నారు. అర్ధరాత్రి వరకు ఫోన్ చూడటం వల్ల నిద్ర లేమి ఏర్పడి శరీర సహజ చక్రాన్ని దెబ్బతీసి జీవక్రియ రుగ్మతలకు దారితీస్తుందని పేర్కొంటున్నారు. సరైన డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా స్టెరాయిడ్లను వాడటం వల్ల ఊబకాయం, మధుమేహం, ఎముకల బలహీనత వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇప్పటికే తెలంగాణ.. అందులో మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరం భారతదేశ మధుమేహ రాజధానిగా పిలవబడుతోందని.. ఇప్పుడు ఈ ఊబకాయం కూడా పెరగడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒబేసిటీ అనేది ఒక నిశ్శబ్ద మహమ్మారి అని.. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. 20 నుంచి 30 ఏళ్ల వయస్సులోనే అనేక వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. ఇది మానసిక ఆరోగ్య సమస్యలకు, ఆరోగ్య వ్యవస్థపై భారాన్ని పెంచుతుందని హెచ్చరించారు.ప్రస్తుతం చిన్న పిల్లల్లో కూడా ఒబేసిటీ పెరుగుతోందని.. దీనివల్ల గతంలో అరుదుగా కనిపించే నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులు ఇప్పుడు పిల్లల్లో కూడా కనిపిస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవడం, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు తినడం తగ్గించడంతోపాటు.. శారీరక శ్రమను పెంచడం అత్యవసరమని సూచిస్తున్నారు.

## ఇకపై డిగ్రీకీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ !



హైద్రాబాద్: రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ పరీక్ష ఉంటుందా సొంతంగా ప్రవేశాలు జరుపుకొంటున్న నాన్ దోస్త్ డిగ్రీ కళాశాలలను గాడిలో పెట్టాలంటే అదే మార్గమా దీనిపై ఉన్నత విద్యామండలి, కళాశాల విద్యాశాఖ సమాలోచనలు చేస్తున్నాయి. అయితే సాధారణంగా ఇంటర్ ఫలితాల అనంతరం డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ – తెలంగాణ దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాలకు షెడ్యూల్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు తాజాగా సమావేశమై చర్చించారు.సొంతంగా ప్రవేశాలకు పరీక్షలు : రాష్ట్రంలో ప్రస్తుతం 826 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో దోస్త్ ద్వారా సీట్లను భర్తీ చేస్తున్నారు. అదే సమయంలో దాదాపు 70 ప్రైవేట్ కళాశాలలు సొంతంగా ప్రవేశాల పరీక్షలు జరుపుకొంటున్నాయి. ఇందులో పలు కళాశాలలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. 8 ఏళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా కనీసం హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి తగిన పరిష్కారం కోసం విద్యాశాఖ ప్రయత్నించలేదు. తాజాగా దీనిపై అధికారులు దృష్టి పెట్టారు.అన్ని కళాశాలలు కలిపి ఒకేసారి పరీక్షలు : ఇలా వేరువేరుగా పరీక్షలు నిర్వహించడం కాకుండా అన్ని కళాశాలలన్నింటినీ ఒకేతాటి పైకి తీసుకొచ్చేలా ఆలోచనలు చేస్తున్నారు. 2027-28 విద్యా సంవత్సరంలో నాన్ దోస్త్ కళాశాల సమస్య కొలిక్కి తెస్తామని వారు తెలిపారు. జాతీయ విద్యా విధానం కూడా ఎంట్రన్స్ ద్వారా ప్రవేశాలు చేపట్టాలని సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. విధి విధానాల కోసం సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈ ఏడాదికి మాత్రం దోస్త్ ద్వారానే డిగ్రీ ప్రవేశాలు జరపనున్నారు.మిగిలిపోతున్న 60 శాతం సీట్లు : దోస్త్ పరిధిలో మొత్తం 826 కళాశాలల్లో 3.77 లక్షల సీట్లున్నాయి. కానీ అందులో 1.75 లక్షల సీట్లు మాత్రమే నిండుతున్నాయి. 70 కళాశాలల్లో ఒక్క విద్యార్థి చేరటం లేదు. కొన్ని వందల కోర్సుల్లో ఒక్క సీటు కూడా భర్తీ అవ్వడం లేదు. దాని ఫలితమే దాదాపు 60 శాతం సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో జీరో ప్రవేశాల కళాశాలలు, కోర్సులను రద్దు చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా, ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకపోవడంతో ఇలా రద్దు మాటలకే పరిమితమవుతోంది. ఈసారి దీనిపైనా నిర్ణయం తీసుకుంటామని అధికారి పేర్కొన్నారు.డిగ్రీ కోర్సుల కొత్త సిలబస్ : మరోవైపు రాష్ట్రంలో ఉన్న డిగ్రీ కోర్సుల్లో కొత్త సిలబస్ రూపకల్పన చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇక్కడ సమస్యేంటంటే రాష్ట్ర ఉన్నత విద్యామండలి సిలబస్ ను ఆధునికీకరిస్తున్నామని యూనివర్సిటీల్లోని డీన్లతో కమిటీలు నియమించనున్నారు. అలాగే కళాశాల విద్యాశాఖ కూడా అదే పనిని చేస్తామని చెబుతుండటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు శాఖలు వేరువేరు దారిలో వెళ్తుండటంతో యూనివర్సిటీల డీన్లు, బీఓఎస్ ఛైర్మన్లు, ఆచార్యుల్లోనూ అయోమయం నెలకొంది.రాష్ట్ర ఉన్నత విద్యమండలికే అధికారం : నిబంధనల ప్రకారం డిగ్రీ సిలబస్ మార్చే అధికారం కేవలం రాష్ట్ర ఉన్నత విద్యామండలికే ఉంది. కానీ దానికి యూనివర్సిటీల్లోని బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అన్ని విభాగాల డీన్లతో కూడిన స్టాండింగ్ కమిటీలో చర్చించి ఆమోదిస్తే సిలబస్ అమలులోకి వస్తుంది. దీని ప్రకారమే గత సంవత్సరంలో కొత్త సిలబస్ రూపొందించి అన్ని విశ్వవిద్యాలయాలకు పంపించారు. తీరా చూస్తే అక్కడ తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీలో అమలు కాలేదు. మిగతా 95 శాతం వరకు అమలైయిందని విద్యా మండలి వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సారి సిలబస్ ని మరింత పకడ్బందీగా కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుత లోపాలను సవరించుకుంటూ కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నందున వాటికి సంబంధించిన సిలబస్ రూపొందిస్తున్నారు.

### ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగబద్ధంగా ఉండాలి..

హైదరాబాద్, : సామాజిక సాధికారత వారోత్సవాల సందర్భంగా చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. "ఆర్థిక సంస్కరణలు మరియు భారత రాజ్యాంగం: సంఘర్షణలు, వైరుధ్యాలు మరియు భవిష్యత్తు మార్గం" అనే అంశంపై బ్రావు క్యాంపస్‌లోని సి.ఎస్.టి.డి ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయానికి అనుగుణంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాజ్యాంగ ఆశయాలకు విరుద్ధంగా సాగే సంస్కరణలు సామాన్యులకు భారంగా మారుతాయని అభిప్రాయపడ్డారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఎమెరిటస్ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ కీలక ఉపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను వివరించారు. బ్రావు అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ సదస్సు ఉద్దేశాలను వివరించారు.ఏప్రిల్ 9 మరియు 10 తేదీల్లో జరిగే ఈ రెండు రోజుల సదస్సులో దేశం నలుమూలల నుండి విచ్చేసిన ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు మరియు పరిశోధకులు వివిధ అంశాలపై తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో కో-డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవును... కళ్యాణ్ రామ్ సరసన ఆమెనే



అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ అంటే తెలుగులో అంతకుమించిన బంపరాఫర్ లేదన్నట్లే. హిట్ మెషీన్‌గా పేరు తెచ్చుకున్న అనిల్.. ఇప్పటిదాకా అపజయం అన్నదే లేకుండా సాగిపోతున్నాడు. ఒక్క 'ఎఫ్-3' మాత్రమే ఓ మోస్తరు ఫలితంతో సరిపెట్టుకుంది కానీ.. ఇప్పటిదాకా అనిల్ తీసిన మిగతా సినిమాలన్నీ హిట్లు, సూపర్ హిట్లు, బ్లాక్‌బస్టర్లే. ఆయన సినిమాలో నటిస్తే ఒక సక్సెస్ జమ అయినట్లే. అందులోనూ చాలా ఏళ్లుగా హిట్ అన్నదే లేక ఇబ్బంది పడుతున్న ఆర్టిస్టులకు అనిల్ ఛాన్స్ ఇస్తే వాళ్ల ఆనందానికి అవధులు ఉండవు. ఇప్పుడు కన్నడ భామ కృతి శెట్టి ఇదే ఆనందంలో ఉంది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో అనిల్ తీయబోతున్న కొత్త సినిమాలో కృతిని ఒక కథానాయికగా ఎంచుకున్నట్లు ఇంతకుముందే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విషయం అధికారికం అయింది. కృతి కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' తెలుగు ప్రి రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన అనిల్.. తన తర్వాతి చిత్రంలో కృతి నటించనున్న విషయాన్ని ధ్రువీకరించాడు. ప్రచారంలో ఉన్నట్లే కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి కనిపించనున్నట్లు కూడా అనిల్ వెల్లడించాడు. దీంతో ఇక ఈ చిత్రంలో వెంకీ సరసన ఎవరన్నదే తేలాల్సి ఉంది. ఈ పాత్రకు కీర్తి సురేష్ పేరు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగులో 'ఉప్పెన' లాంటి బ్లాక్ బస్టర్ మూవీతో కథానాయికగా పరిచయం అయి.. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాల్లో నటించిన కృతికి.. ఆపై వరుసగా ఫ్లాపులే ఎదురయ్యాయి. ఆమె ఫ్లాపుల పరంపర ఇప్పటికే అరడజనుకు చేరుకుంది. 'ఎల్ఐకే' అయినా హిట్ అందిస్తుందేమో అని ఆమె ఎదురు చూస్తోంది. వరుసగా రెండు సంక్రాంతి పండుగలకు 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాలతో భారీ విజయాలందుకున్న అనిల్.. ఇప్పుడు తీయబోయే సినిమాతో మరోసారి సంక్రాంతినే టార్గెట్ చేయబోతున్నాడు.

# పెద్ది... పెద్ద మనసు చేసుకుని చెప్పేసెయ్



ఇండస్ట్రీ, ప్రేక్షకులు అందరూ ఎదురు చూస్తున్న క్షణం పెద్ది అనౌన్స్ మెంట్. ఏప్రిల్ 30 రావడం లేదని ప్రపంచం మొత్తం కోడై కూస్తున్నా నిర్మాణ సంస్థలు మాత్రం పెదవి విప్పడం లేదు. దీనికి తోడు రామ్ చరణ్ మొన్న రాకాస ఇంటర్వ్యూలో లేట్ లేదని చెప్పడం, ట్విట్టర్ వేదికగా డిస్ట్రిబ్యూటర్ల లిస్టు ఒక్కొక్కటిగా బయటికి రావడం అనుమానాలు పెంచుతున్నాయి తప్పించి తగ్గించడం లేదు. దీని వల్ల బయ్యర్లు ఏమో కానీ అభిమానులు ఒత్తిడికి గురవుతున్నారు. తాజా సమాచారం మేరకు పెద్ది ఏప్రిల్ 30 రావడం లేదు. ఎలాంటి టెన్షన్ లేకుండా తగినంత సమయం దొరికేలా జూన్ 4 లేదా జూన్ 25 రెండు ఆప్షన్ల మీద కసరత్తు చేస్తున్నారట. మొదటి డేట్ కి టాక్సిక్ ఉంది కాబట్టి జూన్ మూడో వారానికి షిఫ్టయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ యష్ రానంటే మాత్రం రామ్ చరణ్ రంగంలోకి దిగవచ్చు. పెద్ది ప్రకటన రాగానే మా ఇంటి బంగారం, స్వయంభు లాంటివి డేట్లు వేసుకోవడానికి రెడీగా ఉన్నాయి. గాయపడ్డ సింహం ఆల్రెడీ మే 1 వస్తుంది. సో ఇంత క్లారిటీ బయటి వర్గాలకు ఉన్నప్పుడు ప్రొడక్షన్ హౌస్ వీలైనంత త్వరగా స్పందిస్తే మంచిది. ప్రస్తుతం ఐటెం సాంగ్ ఏర్పాట్లలో బిజీగా ఉన్న దర్శకుడు బుచ్చిబాబు అందులో ఎవరు డాన్స్ చేస్తారనేది బయట పెట్టడం లేదు. మృణాల్ ఠాకూర్ ని అడిగితే దాటవేసింది తప్ప చేయడం లేదని చెప్పలేదు. డెకాయిట్ ప్రమోషన్ల కోసం హైదరాబాద్ లోనే ఉండటం చూస్తుంటే సాధ్యాసాధ్యాలను అంత ఈజీగా కొట్టిపారేయలేం. టెన్షన్ తీరిపోయేలా ముందైతే ఈ అనుమానాల గోడలు బద్దలు కొట్టేయాలి. జూన్ ఫిక్స్ కావడం ఒకరకంగా మంచిదే. అసలే ఎండలు మండిపోతున్నాయి. ఐపీఎల్ ఫీవర్ జనంలో బాగానే ఉంది. కీలక మ్యాచులు ఉన్నప్పుడు థియేటర్లు ఖాళీగా ఉంటున్నాయి. బైకర్ లాంటివి ప్రభావితం చెందుతున్న వైనం గమనిస్తున్నాం. సో పెద్ది తప్పుకోవడం అన్ని రకాలుగా మేలు చేసేదే. రెహమాన్ ఇచ్చిన పాటల్లో రెండు ఛార్ట్ బస్టర్ అయిపోగా మిగిలిన వాటి కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు.

## బంగాల్ కాంగ్రెస్ ఎన్నికల హామీలు

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ బంగాల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ భారీ హామీలు ప్రకటించింది. బంగాల్‌లో అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ఖర్గే తెలిపారు. విద్యార్థినులకు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీనికయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఖర్గే పేర్కొన్నారు. సన్నకారు, భూమిలేని రైతులకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. వ్యవసాయ అవసరాల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఖర్గే స్పష్టం చేశారు. 'యువ సమ్మాన్' పథకం కింద ప్రభుత్వంలో ఉన్న ఖాళీ పోస్టులను ఏడాదిలోగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. బంగాల్‌లోని ప్రతి జిల్లాలో కృత్రిమ మేధ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఖర్గే వెల్లడించారు.

# రైతు భరోసాకు నిధుల సమీకరణ

హైదరాబాద్, : రైతు భరోసా రెండో విడత కోసం ప్రభుత్వం నిధులు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే మొదటి దఫా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినప్పటికీ రెండో విడత కోసం వారు ఎదురుచూస్తున్నారు. యాసంగి పంటలు చేతికొచ్చే సమయం దగ్గర పడుతుండడంతో సాధ్యమైనంత త్వరగా ఈ నెలలోనే పంపిణీ పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. యాసంగి సీజన్ రైతు భరోసా నిధులను మూడు దఫాలుగా జమ చేస్తామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. మొదటి దఫా నిధులను గత నెల 23న రైతుల ఖాతాల్లో జమ చేసింది. మొత్తం 68,89,955 మంది రైతులకు ఒక ఎకరంలోపు వరకు సొమ్మును వేసింది. 57,44,907.19 ఎకరాలకు మొత్తం రూ.3,446.94 కోట్లు జమ చేసింది. రెండో దశ నిధులను ఈ నెల 22లోపు, మూడో దఫా నిధులను ఈ నెలాఖరుకల్లా వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిధులు సమీకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ, ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రతి నెలా ఆదాయం సమకూరుతుంటుంది. వీటిలో ఎక్కువ శాతం నిధులు ఉద్యోగుల వేతనాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలకే ఖర్చవుతుంటాయి. మిగిలిన నిధులను ఖజానాలో ఉంచి అత్యవసరాలకు వినియోగించుకోవడం పరిపాటి. ఇవి కాకుండా ప్రభుత్వం బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు తీసుకుంటుంది. వీటి నుంచి కూడా అత్యవసర స్కీములకు నిధులు సర్దుబాటు చేయడం సాధారణమే. అందులో భాగంగానే మార్కెట్ నుంచి రుణాలను పెద్దమొత్తంలో సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 7న ఒకేసారి రూ.3,900 కోట్లు రుణం తీసుకుంది. ఈ నెల 21న మరో రూ.3,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఇలా మొత్తం రూ.6,900 కోట్లు ఖజానాలో ఉంటాయని తెలుస్తోంది. వాటి నుంచి రెండో దఫా రైతు భరోసాకు కొంతమేర నిధులు బదలాయించే అవకాశాలున్నట్లు తెలిసింది. రెండో దఫా కింద ఐదెకరాల వరకు సొమ్ము జమ చేయవచ్చని సమాచారం. ఇందుకు రూ.3,000 నుంచి రూ.4,000 కోట్లు అవసరమవుతాయని అంచనా. మూడో దఫాను నెలాఖరు లోగా జమ చేసే అవకాశాలున్నాయి. వాస్తవానికి రైతు భరోసా స్కీమ్‌ను ఒక సీజన్‌లో అమలు చేయడానికి రూ.9 వేల కోట్ల పైచిలుకు నిధులు అవసరమవుతాయి.

## రైతుల ప్రయోజనాల కోసమే గోదాముల నిర్మాణం

తుంగతుర్తి, ఏప్రిల్ 9గ్రామాల్లోని రైతుల ప్రయోజనాల కోసమే గోదాముల నిర్మాణం ప్రభుత్వం చేపట్టినట్లు, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామం శివారులో గల రుద్రమ్మ చెరువు వద్ద రూ.10 కోట్ల వ్యయంతో నూతన గిడ్డంగులు ఏర్పాటు కార్యక్రమంలో భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అడ్డగూడూరు కేంద్రంలో నూతనంగా పారిశ్రామిక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి అదనంగా 2000 నూతన ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత మహాలక్ష్మి పథకం, రూ.500 కే గ్యాస్, సన్న బియ్యం పంపిణీ, పేద ప్రజల గుండెల్లో అభివృద్ధి పథకాలు నిలిచిపోయాయన్నారు. మద్దిరాల నూతనకల్ మండలాల నడుమ నూతనంగా జూనియర్ కాలేజ్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. వెలుగు పల్లి గ్రామానికి సుమారు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కోటి రూపాయలకు పైగా వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూ తెలంగాణతోనే సాధ్యమని వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ తెలంగాణ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వాన్ని ఒప్పించి పరిష్కరించామన్నారు శిశు సంరక్షణ సెలవులు తీసుకొచ్చిన ఘనత తమదేనన్నారు. ఉపాధ్యాయులకు టెట్ అర్హత లేకుండా పదోన్నతలు సాధించామని, పెండింగ్‌లో ఉన్న బదిలీలు, జీవో 317 అమలులో కీలకంగా వ్యవహరించి ఉపాధ్యాయులకు న్యాయం చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, సోమనాథ్, యుగేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, భూపతిసింగ్, రామచంద్ర రాథోడ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచండి



హైద్రాబాద్: కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిధుల విడుదల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు. మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్ డీఎస్ ఏ) సూచనల మేరకు వీలైనంతగా వేగంగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులపై సమీక్ష : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సీడబ్ల్యూపీఆర్ ఎస్ ఆధ్వర్యంలో పనులు : మరమ్మతుల కోసం ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి, పనుల్లో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలన్నారు. నీటి పారుదల శాఖ, సీబ్ల్యూపీఆర్ ఎస్ , బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెన్షన్స్ తో బృందం ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం : మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ఈ పని పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించి డిజైన్లు సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. పనుల్లో జాప్యానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిధుల విషయంలో ఇబ్బంది కలగనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని సీఎం తెలిపారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇప్పటికీ ప్రారంభం కాలేదు : తెలంగాణ రాష్ట్రంలో ఎంతో కీలకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతు పనులు జాప్యం అవుతున్న సమయంలో తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. ఈ కాళేశ్వరంలో ముఖ్యమైన పరీక్షలను ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ లోగా చేయాలని ఎన్డీఎస్ ఏ సూచించినప్పటికీ, ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికి బ్యారేజీలకు ముఖ్యమైనటువంటి జియో టెక్నికల్ , జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్స్ కాంక్రీట్ స్ట్రక్చర్ ను అంచనా వేసేందుకు దానికి సంబంధించిన పనులు ఇప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. పరీక్షలు పూర్తయితే గానీ నిర్ణయం తెలియదు : మేడిగడ్డ బ్యారేజీలో యూపీవీ-రీబండ్ హ్యామర్ పరీక్షలు ఐదు బ్లాక్ లలో మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా మూడు బ్లాక్ లకు జరగాల్సి ఉంది. ఇవన్నీ బ్లాక్ లకు పూర్తయితేనే ఓ నిర్ణయానికి వచ్చేందుకు వీలవుతుందని సంబంధిత ఇంజినీర్లు చెబుతున్నారు. అన్నారం బ్యారేజీలో 22 వెంట్స్ కు పూర్తి కాగా మరో 32కు ఇంకా పెండింగ్ లో ఉంది. మేడిగడ్డలో జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ కు అవసరమైన బోర్ హోల్స్ కోసం మూడు డ్రిల్లింగ్ మిషన్లు వచ్చాయని మరో మూడు త్వరలోనే వస్తాయని గత వారం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్డీఎస్ఏ ఛైర్మన్ కు ఇచ్చిన రిపోర్టులో తెలిపింది. మేడిగడ్డ కాంక్రీట్ స్ట్రక్చర్ తెలుసుకునేందుకు 30 బోర్ హోల్స్ వేయాల్సి అవసరం ఉంది.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

హైద్రాబాద్:పదో తరగతి, ఐటీఐ పూర్తి చేసి, మంచి కెరీర్ కోసం ఎదురుచూస్తున్నారా? అయితే మీ కోసం ఒక మంచి నోటిఫికేషన్‌ని విడుదల చేసింది రైల్వేశాఖ. దక్షిణ మధ్య రైల్వే నుంచి 2,801 అప్రెంటిస్ పోస్టు లను భర్తీ చేస్తోంది. ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా కేవలం మార్కుల ఆధారంగానే రైల్వే లో అడుగు పెట్టే ఛాన్స్ కల్పించింది. మరి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఎప్పుడు? ఏయే విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి? ఇలాంటి మరిన్ని విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. రైల్వేలో కెరీర్ ప్రారంభించడం మీ కలనా? అయితే మీకు ఒక గుడ్‌న్యూస్! సౌత్ సెంట్రల్ నుంచి 2,801 పోస్టులతో అప్రెంటిస్ నోటిఫికేషన్ విడుదలైంది. ఇలాంటి పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా నే ఎంపిక ప్రక్రియ జరగుతుంది. సెలక్ట్ అయితే స్టైపెండ్‌తో పాటు శిక్షణ సమయంలో వసతి సౌకర్యం కూడా కల్పిస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో పని చేయడానికి ఆహ్వానం : వివిధ విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయనుంది రైల్వే బోర్డు. ముఖ్యంగా ఏసీ మెకానిక్, కార్పెంటర్, సీఓపీఏ, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, మిషినిస్ట్, ఎంఎంటీఎం, మోటర్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ వంటి పోస్టుల ఉంటాయి. ఏపీ, తెలంగాణ సహా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సికింద్రాబాద్, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ అలాగే నాందేడ్ డివిజన్లతో పాటు తిరుపతి, రాయనపాడు వర్క్‌షాపుల్లో కూడా ఖాళీలు ఉన్నాయి. మీకు నచ్చిన చోట, మీ సొంత ప్రాంతానికి దగ్గర్లోనే శిక్షణ తీసుకునే అవకాశం ఉంటుంది. చాలామందికి వచ్చే డౌట్ ఏంటంటే ట్రైనింగ్‌లో డబ్బులు ఇస్తారా? అని. కచ్చితంగా ఇస్తారు! అప్రెంటిస్ సమయంలో నెలకు స్టైపెండ్ రూపంలో ఆర్థిక సాయం అందుతుంది. దీనివల్ల పని నేర్చుకుంటూనే డబ్బు సంపాదించవచ్చు. అంతేకాదు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ కూడా ఇస్తారు. దీంతో భవిష్యత్తులో రైల్వే గ్రూప్-ఐ ఉద్యోగాల్లో 20% కోటా మీ సొంతం చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా : విద్యార్హతల విషయానికొస్తే పదో తరగతిలో కనీసం 50% మార్కుల ఉత్తీర్ణత ఉండాలి. అలాగే సంబంధించిన ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికేట్ తప్పనిసరి. ఇక వయసు విషయానికొస్తే 11-04-2026 నాటికి 15 నుంచి 24ఏళ్లలోపు ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వరకు సడలింపు ఉంటుంది. అయితే అభ్యర్థులకు ఎలాంటి పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా కేవలం మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. వారికి ఫీజు లేదు : దరఖాస్తు చేసే సమయంలో పదో తరగతి, ఐటీఐ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, ఫోటో, సంతకం తప్పనిసరిగా ఉండాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 11వ తేదీతో ముగుస్తుంది. ఓసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 100 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు లేదు. వివరాలు నమోదు సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే దానికి అభ్యర్థే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ని సందర్శించాలి. వైద్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరి : అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని జిల్లాలకు చెందినవారై ఉండాలి. షార్ట్‌లిస్ట్ చేసిన వారిని డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం పిలుస్తారు. అప్పుడు అన్ని సర్టిఫికేట్లు దగ్గర ఉంచుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ వైద్యుడు జారీ చేసిన వైద్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. భవిష్యత్తులో రైల్వేలో స్థిరపడాలనుకునే వారికి ఈ అప్రెంటిస్ సర్టిఫికేట్ ఎంతో ఉపయోగపడుతుంది. సమయం వృథా చేయకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తూ అందరికీ ఆల్ ది బెస్ట్.

## ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తా..



మునుగోడు,: మునుగోడు లోని ప్రభుత్వ పాఠశాలలలోవిద్య బలోపేతం చేయడానికి కృషిచేసి,అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు . గురువారం మండలంలోని పులిపలుపుల గ్రామంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ఉమ్మడి జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ డ్యూటీ నారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు తో కలిసి పాల్గొని మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.15,000, రూ.10,000, రూ.7,500 ప్రోత్సాహకాలు అందించినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది ఆ ప్రోత్సాహకాలను పెంచుతూ, మొదటి స్థానం వారికి రూ.25,000, ద్వితీయ స్థానం వారికి రూ.15,000, తృతీయ స్థానం వారికి రూ.10,000 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాల్లాంటివని, గ్రామస్థులందరూ కలిసి వాటి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారిలో చాలామంది ప్రభుత్వ బడుల్లోనే చదివారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తన తల్లి పేరుతో నడుస్తున్న సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా పేదలకు సహాయం కొనసాగిస్తానని చెప్పారు. అభివృద్ధి అంశాలపై మాట్లాడుతూ, వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైన ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేయడంలో తమ వంతు పాత్ర ఉందని పేర్కొన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తున్నదని తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు అందించే చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు..

# విద్యార్థులకు పాలు



హైద్రాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ శాఖను తన వద్దే ఉంచుకుని.. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇక ఇప్పటివరకు తెలంగాణలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు అల్పాహారం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారికి ఇక నుంచి పాలు కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లు, ఇంటర్ కాలేజీల్లో 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులకు పాలు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాలు సరఫరా చేయడం కోసం రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ( విజయ డెయిరీ )కి తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్ల ఆర్డర్ ఇచ్చింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం అంటే జూన్ నుంచి విద్యార్థులకు పాలు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు పాలు కూడా అందించాలని నిర్ణయించారు. ఇటీవల విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. విద్యార్థులకు పాలు సరఫరా చేయాలని నిర్ణయించారు.ఈ క్రమంలోనే ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలకు పాలు సరఫరా చేసే బాధ్యతను విజయ డెయిరీకి అప్పగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుకు అనుగుణంగా విజయ డెయిరీ నుంచి విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు కోరగా.. తాజాగా పాలను సరఫరా చేసేందుకు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులకు టెట్రాప్యాక్‌లోనే పాలను సరఫరా చేసేందుకు విజయ డెయిరీ రెడీ అవుతోంది. 1వ తరగతి నుంచి 12వ తరగతులు చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం సమయంలో నిత్యం 150 మిల్లీ లీటర్ల నుంచి 200 మిల్లీ లీటర్ల వరకు పాలు అవసరమని.. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) నిబంధనలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం విద్యార్థులకు 150 మిల్లీ లీటర్లు లేదా 200 మిల్లీ లీటర్ల పాలను టెట్రాప్యాకెట్లలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని విజయ డెయిరీ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణీలు, బాలింతలకు విజయ డెయిరీ 200 మిల్లీ లీటర్ల టెట్రాప్యాక్‌లలో పాలను అందిస్తోంది. వీటితోపాటు ఇటీవలె ములుగు జిల్లా పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లోని 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల చిన్నారులకు 100 మిల్లీలీటర్ల పాలను టెట్రాప్యాక్‌లలో విజయ డెయిరీ ఇవ్వడం మొదలుపెట్టింది. ఈ ప్రక్రియ సక్సెస్ కావడంతో మిగిలిన గిరిజన ప్రాంతాలకు.. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్న పిల్లలకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## అరైవ్-అలైవ్' పకడ్బందీగా నిర్వహించాలి

సిరిసిల్ల,: అరైవ్-అలైవ్ కార్యక్రమాలు పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా మిగతా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అరైవ్-అలైవ్ కార్యక్రమాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేలు హాజరయ్యారు. సందర్భంగా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడు తూ ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశం లోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని వెల్లడించారు. ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తుందని వివరించారు. అరైవ్ అలైవ్ కార్యక్ర మాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియ మాలు అందరూ పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించ డం సామాజిక బాధ్యతని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కు పక్కా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్, ప్రమాద జంక్షన్లు గుర్తించాలని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, స్కూల్ బస్, ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద సైన్ బోర్డు లు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదా రులు హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీని 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాల ని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రజలకు

# విస్తృత అవగాహన కల్పించాలి



సూర్యాపేట, : ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యవారంలో 4వ రోజు ఎయిడ్స్ వ్యా ధి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రెడ్ రన్ ను ప్రభుత్వ జూనియర్ కళాశాల, వద్ద జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి ఆయన మాట్లాడుతూఎయిడ్స్ పై సరైన అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తి విధానాలైన రక్త మార్పిడి, సూదులు/సిరంజీలు, తల్లి నుండి పిల్లకు సోకకుండా గర్భిణీలు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ విషయాల గురించి అన్ని శాఖల వారు విస్తృతముగా అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తి నివారించాలని సూచించారు. తదుపరి జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డా,,పెండెం వెంకట రమణ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటూ వ్యాధికాకున్నా, అంటించుకునే వ్యాధి అని అసురక్షిత లైంగిక సంబంధాల వలన సంక్రమించే అవకాశం వున్నదన్నారు.తగు జాగ్రత్తలతో వ్యాధిని అరికట్టవచ్చు అన్నారు. ఈ కారక్రమశీలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్గా ఎండి షఫీ ఉల్లా, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో డా,,చంద్ర శేఖర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు నాజియా, శ్రీశైలం, శ్రావణి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో ఘోరం

వరంగల్ :వరంగల్ జిల్లాలో ఒక యువతి అనుమానాస్పద మృతి వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. రాయపర్తి మండల పరిధిలోని ఓ తండాకు చెందిన 21 ఏళ్ల యువతిపై అత్యంత కిరాతకంగా సామూహిక అత్యాచారం చేసి ఆపై హత్య చేశారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రావూరు తండాకు చెందిన గంజాయి బ్యాచ్ ఈ ఘాతుకానికి పాల్పడిందని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి నిందితులు యువతిని కిడ్నాప్ చేసి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ గంజాయి మత్తులో ఉన్న నలుగురు యువకులు ఆమెపై అమానుషంగా గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ క్రమంలో యువతికి తీవ్ర రక్తస్రావం కాగా.. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆమెను ఉరివేసి చంపేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. నిందితులు ఎప్పుడూ గంజాయి మత్తులో ఉంటూ గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారని వారి ఆగడాలే ఈరోజు ఒక అమాయక యువతి ప్రాణం తీశాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. అయితే ఈ దారుణంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట వద్ద ఖమ్మం జాతీయ రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోస్టుమార్టం నిర్వహించేందుకు తాము అంగీకరించబోమని బాధితురాలి తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. మార్చురీ వద్ద పెద్ద ఎత్తున బంధువులు, స్థానికులు చేరుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. తమ బిడ్డకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకూడదని.. గంజాయి ముఠాను ఉరితీయాలంటూ వారు నినదించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికే కేసు నమోదు చేసుకున్నామని, నిందితుల కాల్ డేటా, క్షేత్రస్థాయి ఆధారాలను సేకరిస్తున్నామని ఉన్నతాధికారులు తెలిపారు. దీంతో మృతురాలి బంధువులు ఆందోళన విరమించారు.

# రోగులకు ఉత్తమ సేవలు అందించాలి




సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల లో రోగులకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా ప్రభుత్వ ప్రధానవైద్యశాల ఎదుట ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నుంచి పట్టణ ప్రధాన రహ దారుల గుండా అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ గరిమఅగ్రవాల్ మాట్లాడారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలను చేసి ఉత్తమ సేవలందించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్యసేవల కోసం అవసరమైతే కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యే వైద్య సేవలు ఉన్నాయని, వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రేమలో పెద్దపరీక్షలు ఎదుర్కోవాలంటూ తెలంగాణ రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వైద్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

పెద్దపల్లి, : నిబంధనల ప్రకారం తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొను గోలు చేసి 24గంటల్లోగా కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదే శించారు. గురువారం కలెక్టరేట్‌లో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 4.5లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించా మన్నారు. ఈనెలలో కొనుగోళ్లు ప్రారంభించి మే నెలా ఖరుకి పూర్తిచేయాలని సూచించారు. కొన్ని కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపి స్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పున రావృతమైతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అకాలవర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. రామగిరి గ్రామసభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వా లని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని 24గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. అవసర మైన గోనె సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24గంటల్లో 100శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి వేణు, డీఎస్‌వో శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డీసీవో శ్రీమాల, డీఎంవో ప్రవీణ్ రెడ్డి, ఏపీడీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి నుంచి అమృత్ భారత్ ట్రైన్లు షురూ

హైద్రాబాద్: హైదరాబాద్ నుంచి ట్రైన్ ప్రయాణాలు సాగించే వారికి ఇది నిజంగా తీపి కబురే. నగరంలో అతిపెద్ద రైల్వే హబ్‌గా మారుతున్న చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ నుంచి భారత రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు రాకపోకలు సాగిస్తున్నాయి. సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన చర్లపల్లి టెర్మినల్ నుంచి శాలిమార్, నాగర్‌కోయిల్, తిరువనంతపురం, కామాఖ్య వంటి సుదూర ప్రాంతాలకు అమృత్ భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ ట్రైన్లు సామాన్యులకు అందుబాటు ధరలో అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటం విశేషం.మంగళవారం ఉదయం ఒక అరుదైన దృశ్యం ట్రైన్ ప్రయాణికులను ఆకట్టుకుంది. శాలిమార్, కామాఖ్య వైపు ప్రయాణించే రెండు అమృత్ భారత్ ట్రైన్లు ఒకే సమయంలో పక్కపక్క ఫ్లాట్‌ఫారాలపై నిలిచి ఉన్నాయి. కాషాయం, బూడిద రంగు కలయికతో కొత్త శోభను సంతరించుకున్న ఈ కోచ్‌లు టెర్మినల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు ఆ ట్రైన్ల వద్దకు వెళ్లి ఆసక్తిగా పరిశీలించడమే కాకుండా.. వాటి ముందు నిలబడి సెల్ఫీలు దిగుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అమృత్ భారత్ ట్రైన్లు ప్రధానంగా మధ్యతరగతి, పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పోలిస్తే వీటిలో కుదుపులు లేని ప్రయాణం కోసం 'సెమీ పర్మనెంట్ కప్లర్స్' వంటి అధునాతన సాంకేతికతను వినియోగించారు. అలాగే మెరుగైన మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, సురక్షితమైన ప్రవేశ ద్వారాలు, ఆకర్షణీయమైన ఇంటీరియర్స్ ఈ ట్రైన్ల ప్రత్యేకత. సుదూర ప్రయాణాలు చేసే వారికి తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణం వంటి అనుభూతిని కలిగించేలా వీటిని తీర్చిదిద్దడం పట్ల రైల్వే శాఖపై ప్రయాణికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. హైదరాబాద్ నగరవాసులకు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చర్లపల్లి టెర్మినల్ ఇప్పుడు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు సాగిస్తుండటంతో నగర తూర్పు ప్రాంత ప్రజలకు ప్రయాణ భారతం సులభతరమైంది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు భారత దేశాలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఈ అమృత్ భారత్ రైళ్లు ఒక వరంగా మారాయి. రానున్న రోజుల్లో మరిన్ని సర్వీసులు ఇక్కడి నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు.ఇక చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి ప్రతి నిత్యం వందల సంఖ్యలో ట్రైన్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ట్రైన్ల రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ పట్టణాలను నడుస్తూ ప్రయాణికులకు సేవలను అందిస్తున్నాయి. ఈ టెర్మినల్ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి.

# నకిరేకల్‌లో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తాం



నకిరేకల్, :నకిరేకల్ లో త్వరలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభిస్తామ ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని సాయి బాబా ఆలయంలో, నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 499 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.1 కోటి 78 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణానికి ట్రామా కేర్ సెంటర్ మంజూరు అయినట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం టిఫిన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.కడపర్తిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని,హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహాలో ప్రతి నియోజకవర్గానికి ఒక స్కూల్ ను సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారన్నారు గత 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు.గత ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో డిండి, బ్రహ్మణవెల్లంల, అయిటిపాముల, శివనగూడెం ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ జరుగుతోందని పేదలందరికీ 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా గృహజ్యోతి కింద లబ్ధి జరుగుతుందన్నారు వచ్చే సంవత్సరం నుండి 25 పాఠశాలలో ××ు కోచింగ్ అందించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్లు గుత్తా మంజుల - మాధవ్ రెడ్డి, నర్రా వినోద్ - మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు చేవుగోని రజిత - శ్రీనివాస్, పందిరి గీత - రమేష్, మండల పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గుడిపాటి లక్ష్మీనరసింహ, కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత

గద్వాల : ఎయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎయిడ్స్ అ వగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎయిడ్స్ అనేది హెచ్ఐవీ వైరస్ కారణంగా సంక్రమించే వ్యాధి అని, ఇది శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీ చికిత్స తీసుకుంటే వైరస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ప్రోగ్రాం అధికారి రాజు, ఇతర వైద్యాధికారులు, డాక్టర్లు ఉన్నారు.

## రోడ్డు భద్రత కార్యక్రమాలను విజయవంతం చేయాలి

భువనగిరి :రోడ్డు భద్రత కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలపై సిఎస్, డిజిపి లు వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ14న అంబేద్కర్ జయంతి సందర్భంగా రోడ్ భద్రత ప్రతిజ్ఞ, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.పోలీస్ శాఖ తరపున అరైవ్ -- అలైవ్ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టును పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280